# ప్రియురాలు

రచన :

... కొమాండూరి ...

రమేష్ పేంటుజేబుల్లో చేతులు పెట్టుకొని ఎదురుగా పిల్లలతికిస్తున్న వాల్‌పోస్టర్ల వంక చూస్తు రాయల్ పిక్చర్ ప్యాలెస్ ముందు నిలుచున్నాడు. గోడ గడియారం 5 కొట్టిందప్పుడు. సినిమా మొదలుపెట్టడాని కింకా గంటపైముంది. ఏమీ తోచక అటూ, యిటూ, తిరుగుతూ బుకింగ్ ఆఫీసు కిటికీ అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకొని కొద్దిగంటల క్రితమే చక్కగా దువ్వుకొన్న క్రాపు, టై, బటన్‌హోల్‌లో పెట్టుకొన్న మల్లెపువ్వు సరిజేసుకుంటూ "ఆమె వస్తే నన్న ప్రకారం ధైర్యంచేసి రాగలదా? లేక ఆఖరు క్షణాల్లో కాళ్ళు చల్లబడి ఆశాభంగం కలిగిస్తుందా!" అని ఏందో తనలో తను గొణుక్కున్నాడు.

ఇంతలో ఏదో తట్టినట్లు గిరుక్కున తిరిగి వళ్ళంతా కళ్ళుచేసుకొని, జనసమూహంలోకి కలయజూచాడు. కాని, ఎంతసేపటికీ తన క్కావలసిన మనిషి దొరక్కపోవటంచాత కాస్త చిరాకుగలిగింది. మళ్ళీ జేబులో చెయ్యెట్టి తడిమి ఓ ఫోటో బైటకుతీసి చప్ప రిస్తూ చూస్తున్నాడు. అందులో 'ఈత' డ్రస్సు వేసుకొని, నీటివడ్డున నిల్చొని, ఓకాలు నీటి వేడిని పరీక్షిస్తున్నదానిలా పెట్టి, ముఖం మాత్రం కనబడకుండా సైడ్ ఫోటో తీయించుకొని తనకు పంపటంవల్ల కాస్త అనుమానం గలిగింది.

తిరిగి కళ్ళు కాస్త పెద్దవిచేసి "నల్లగా వంకులుతిరిగి వేళ్ళాడుతున్న ఆజుట్టూ, పొడుగ్గావున్న ఆ కాళ్ళూ, ఎటుబడితే అటు తిరిగేట్టున్న ఆ సన్నని చేతులూ, పొడుగ్గా సన్నగావున్న ఆ రొమ్ముల క్రిందిభాగం, గట్టిగా రొమ్ముల కతుక్కుపోయి చక్కని గూళ్ళను కనుబరుస్తున్న ఆబాడీని గుటకలు మ్రింగుతూ చూస్తుండేసరికి ప్రక్కన యేదో అలికిడయింది. చప్పున దాన్ని పేంటులోకి తోసి, లోపలికిపోయిన ఆచేతికి పనిగల్పిస్తూ కేస్‌తీసి, వో సిగరేట్ వెలిగించి, బలంకొద్దీ పొగబీల్చి, చిన్నచిన్న మేఘాలు గల్పిస్తున్నాడు.

ఎవడికన్నా వీడిమీద కాస్త అనుమానం కలిగి, వోపికచేసుకొని, పరీక్షించి చూచాడంటే—సినీమాకు వచ్చినవాడు గాదనీ, ఎవరికోసరమో కాచుక్కూచున్నవాడనీ—నిమిషంలో గ్రహిస్తాడు. అప్రయత్నంగా వాడి కళ్ళు తన రిస్ట్‌వాచీమీదకు పోయినై, సరిగ్గా 5-35 అయింది.

ఇంతకీ వాడు కాచుకూర్చున్న పిల్లపేరు "హిమబాల". 1950 షేప్స్‌లో వుంటుందామె. వుత్తరాల మూలకంగా పరిచయమైంది వీడికి. కొన్నాళ్ళు వుత్తరప్రత్యుత్తరాలు జరిగింతర్వాత "ఓరోజు నిర్ణయించి, ఆరోజు తప్పకుండా దర్శనమిస్తానని" చెప్పింది. అసలీ గొడవంతా, తన భార్య లక్ష్మి సామాన్యంగా చదువుతుండే "ఆపర్ణ మహిళ" అనే ఆడాళ్ళపత్రిక చూడటంవల్ల జరిగింది. ఓరోజు ఏం తోచకుండా ఆ పత్రిక తిరగేస్తుండేసరి కందులో—"

"అపూర్వ అవకాశం

ఉత్తరాల స్నేహితుల సంఘంలో స్త్రీ పురుషు లందరూ చేరి తమ తమ వ్యక్తిగతాభిప్రాయాలను, ఇతరులకు తెలుపుకొని సంతోషించవచ్చు. మీ వుత్తరాల స్నేహితులకు వ్రాయుజాబులన్నీ సంఘ క్లబ్బు అడ్రసుకు వ్రాసినయెడల వాటిని అసలువారికి చేర్చు బాధ్యత క్లబ్బువారిదే. వివరాలకు నేడే వ్రాయండి. లేదా ఆఫీసుకువచ్చి మేనేజరు గారితో సంప్రతించవచ్చును."

అని వుండేసరికి తను గూడా ఓ స్నేహితురాల్ని సంపాదించాలనుకొన్నాడు. అందులో తన భార్యకంట ఆ ఆలేఖలు పడకుండా వుండేటందుకు క్లబ్బులోనే వుత్తరాలు తీసుకొనే యేర్పాటు వుండె. అందుకని తన అభిప్రాయాన్ని దృఢపరచుకొని, మర్నాడు క్లబ్బుకు పోయి, తనకు 20 సంవత్సరాల ప్రాయంగల స్త్రీ స్నేహితురాలు—ఆమె అభిరుచులెలావున్నా సరే – కావాలన్నాడు. వెంటనే మేనేజరు అర డజను మంది పేర్లు గల ఆడవాళ్ల లిస్టును చూపించి వాళ్ల అభిరుచుల్నీ, ఏ రకం మనుష్యుల స్నేహితం వాళ్లు కోరుతున్నదన్నీ చెప్పాడు. ఓ అర గంట సేపాలోచించి, చివరకు 22 సంవత్సరాల వయస్సుగల "హిమబాల" అనే యువ్వనిని కోరుకున్నాడు. ఆమె పొడవు 5 అడుగుల 3 అంగుళాలు. బరువు 114 పౌన్లు. అంత లావుగాకుండా, అంత సన్నమూ గాకుండా మధ్యస్తంగా వుంటుంది. చాలా చక్కనిది. స్టాంపుస్కలెక్టింగ్ అన్నా, సంగీతమన్నా మాచెడ్డ సరదా. రమేష్ గూడా సంగీతమంటే చెవి గోసుకుంటాడు. ఇంతకీ ఆమె సంగీతం పాడగలదో, లేదో, అనే సంగతే వాడి కవసరం లేకపోయింది. కాని, వాడు కోరిందల్లా, ఆమె అంగసౌష్టవం—ఆవిడ ఫోటోను గూడా వివిధ కోణాల్లో చూచి చాలా అందమైనదే అయివుంటుందనుకొని, ఆమె పేరు తన డైరీలో నోట్‌చేసుకొని, మొదటిలేఖ రాద్దామని, నేరుగా యింటికి వచ్చాడు. కాని, మొదటి వుత్తరం మాత్రం సర్వసామాన్యంగా, తన వృత్తిని వుదహరిస్తూ, తనకు సంగీతమంటే కొలవటాని గ్గూడా వీల్లేనంత పిచ్చి వున్నదంటూ, వున్నదొకటీ, లేనిదొకటీ, కల్పించి రాశాడు.

కొన్ని నెలలు గడిచేటప్పటికి వాళ్ళ స్నేహం "ఆవిడ తన్ను రాయల్ పిక్చర్స్ ప్యాలెస్ వద్ద 5-50 కి కలుసుకున్నట్లయితే, యిద్దరూ సినీమా చూచుకొని, హోటల్లోనే భోంచేసి" వరకూ వచ్చింది. ఇక వాళ్ళు ఒకళ్ళ నొకళ్ళు తెలుసుకోటానికి, రమేష్‌కు బూడిదరంగుసూటూ, ఎర్రని టై, బటన్ హోల్‌లో మల్లెపువ్వూ — ఆమెకు తెల్లని

చీర, ఎర్రని ప్లాస్టిక్ బ్యాగ్, తల్లో గులాబి పువ్వూ గుర్తులు.

అసలు వాడింటిదగ్గర బయల్దేరేటప్పుడు లక్ష్మితో తనకేవో ముఖ్యమైన పనులుండటంవల్ల హోటల్లోనే భోంచేసివస్తాననీ, కాబట్టి తనకోసరం కాచుకూర్చోవద్దనీ, చెప్పాచ్చాడు. అందుకు లక్ష్మి మొహాన్నకొట్టినట్లు "తన స్నేహితురాలింట్లో పుట్టినరోజు పండగ జరుగబోతుందనీ, అందుకు తాను సాయంత్రం 6 గంటలకల్లా అక్కడ హాజరుకావాలనీ చెప్పి, రెండో తాళంచెవి యిచ్చింది.

రమేష్ పిక్చర్ ప్యాలెస్పై అంతస్తుకేసి చూస్తూ ప్రక్కనున్న గడియారం చూసేసరికి 16 నిమిషాలు తక్కువగా 6 గంటలయింది. మరొక్క క్షణంలో ఆట మొదలెడ్తారు. పాపం! వళ్ళంతా జెర్రులు ప్రాకినట్లు, కడుపులో చెయ్యెట్టి కెలికినట్లుంది రమేష్కు. వెనక బూట్ల చప్పుడయ్యేసరికి ఆత్రంతో వెనక్కు తిరిగిచూచాడు. కాని తననుకొన్న మనిషిగాక, ఎవరో 40 ఏండ్ల పైబడ్డ వృద్ధురాలు రిస్టువాచీ చూచుకుంటూ పోతోంది. అప్పటికి సరిగ్గా 6-15 గంటలయింది. "ఇంకా రాకపోవటానికి కారణం ఏంటో చెప్మా?" అని ఆలోచిస్తూ "బహుశా తన కందంగా కనబడటానికిగాను చక్కగా అలంకరించుకుంటున్నదేమో" అనుకున్నాడు. ఇక లాభం లేదని, ఓర్పుతగ్గి—అంతకంటే చేసేదిలేక— ఓ సిగరెట్ వెలిగించి ఆ సాయంత్రం ప్రోగ్రాం ఏంటా?" అని ఆలోచిస్తుండేసరికి గోడ గడియారం ఇంపైన సంగీతాన్ని కలుగజేస్తూ 6 కొట్టింది. వెంటనే పిక్చరుప్యాలెస్లో రికార్డుల సంగీతాన్నాపి, న్యూస్రీలు మొదలెట్టారు.

అయినా ఇంకో పది నిమిషాలు చూద్దామనుకొని మెయిన్ గేటువంక చూస్తూ "ఆమె అనుకున్నప్రకారం రాకపోవటానిక్కారణం ఏంటో చెప్మా?" అని అనుకుంటూ మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. కాక "తన్ను చూచి తా ననుకొన్నంత అందంగా వుండని కారణముగా వెనక్కు తగ్గిందేమో! అనుకున్నాడు. అటూ యిటూ పచార్లుచేస్తూ కళ్ళు వాచీకేసి చూచేసరికి సరిగ్గా 6-10 అయింది. ఇక నెలాగూ లాభం లేదనుకొని చేతిలోని సిగరెట్ ముక్కను గిరవాటువేసి గిరుక్కున తిరిగి ఆచోటు వదలి యింటిముఖంపట్టాడు.

మన సనేకవిధాల భ్రమిస్తోంది. కొంచెమైతే కారుక్రిందబడేవాడే. ఆరోజు లేచిన వేళ మంచిదవటంవల్ల మెల్లిగా తప్పించుకొని సందుచివర కెళ్ళి టాక్సి మాట్లాడుకొని ఇంటి అడ్రసిచ్చాడు. కారు జోరుగా పోతోంది. అంతకుముందు 3 గంటల క్రితమే వర్షం కురియటంవల్ల మొహానికి చల్లగాలి తగుల్తున్నది. సమయం సంతోషకరమైనదైనప్పటికీ, అపుడే అయిన శృంగభంగంవల్ల మనసు కానందం లేకపోయింది. ఆ చచ్చుబుర్ర కెందుకనో లక్ష్మిగుర్తుకొచ్చింది. "తన విషయం అందులో అప్పటికప్పుడే అయిన శృంగభంగవిషయము. లక్ష్మికి తెలిస్తే ఏమనుకుంటుందో? ఏమైనా లక్ష్మికి తెలియకుండా వుంటేనే బాగుంటుంది. లేకపోతే తన్ను గడ్డిపోచక్రింద లెక్కకట్టెయ్యదూ? అయినా యిటువంటి రహస్యం తెలియకుండా వుండటానికేగా సరైన అడ్రసు యివ్వంది. ఏదేమైనా యీ విషయంమాత్రం లక్ష్మికి తెలియదు. హాయిగా పుట్టినరోజు పండగలో పాల్గొనివుంటుంది" అని ఆలోచిస్తుండేసరికి టాక్సి యింటిముందాగటం, క్రింది అంతస్తులోనున్నవారి గోడగడియారం అరగంట గొట్టడం దాదాపు రెండూ ఒకేసారి జరిగినై.


## నిట్టూర్పు

ప్రణయమే ప్రమాదానికి దారితీస్తుంది. విరాగిని చేస్తుంది. త్యాగానికి ఉసిగొల్పుతుంది. ఈ నవలయందు స్త్రీ వలచినను పురుషుడు మిత్రునికై స్వార్థాన్ని గణించక త్యాగంచేయటం అపూర్వ విషయం. తాననుకొన్నట్టు, తన్ను ప్రేమించినయువతి తన ఇష్టాను సారం మిత్రుని వివాహమాడి సౌఖ్యాన్ననుభవించక పోవటంచూచి చింతకులోనై తను మరుగైపోవుట విషాదపరిణామం. ఇది పాశ్చాత్య నవలా పద్ధతి ననుసరించి రచింపబడినది. తెలుగులో ఇట్టి నవలారచన కిదే ప్రథమం. చదువుటలో మైమరపును గల్గించును.

వెల 0—8—0 అణాలు.

చిత్రగుప్త ఆఫీసు,
6, లాయర్ చిన్నతంబి
మొదలివీధి, మద్రాసు.


డ్రైవరుకు డబ్బిచ్చేసి తాళంచెవికోసరం పేంటు జేబులో చెయ్యెట్టి కెలుకుతూ పై అంతస్తుకుపోయి చూచేటప్పటికి తలుపులు తీసినట్లుగా గనపడినై. "దొంగలు పడన్నా వుండాలి లేక లక్ష్మికి తలనొప్పివచ్చి తన స్నేహితురాలియింటికి పోకుండానన్నా వుంటాలి" అని అనుకుంటూ లోపలి గదిలోనికి పోయి చూచి చాలా ఆశ్చర్యపడ్డాడు. "తెల్లటిచీరగట్టుకొని, ఎర్రనిగులాబి తల్లో పెట్టుకొని, చేతితో ఎర్రని ప్లాస్టిక్ బేగ్ పట్టుకొని, వీడిరాక గమనించకుండా, కిటికీలోకి ముఖంపెట్టుకొని ఏంటో ఆలోచిస్తూ బజార్లో పోయే ట్రాముల కేసి, మనుష్యులకేసి చూస్తూంది. "ఈమె ఇక్కడి కెలా వచ్చినదో?" అనుకుంటూ చాలా ఆశ్చర్యంతో ఉబలాటపడుతున్నాడు. మెల్లగా చప్పుడుగాకుండా తలుపులువేసి తప్పటడుగులు వేసుకుంటూ వెనుకగా, దగ్గరగా, పోయేకొద్దీ మాంచి సువాసన రావటం మొదలెట్టింది. ఆ సువాసనకి వీడి వళ్ళు మత్తెక్కి, యింకా వాసన పీల్చాలనుకుంటూ బాగా గాలి పీల్చటం మొదలెట్టాడు. ఇంతలో వాడి ఖర్మంగాలి ఓ ట్రంకుపెట్టె వాడి కాలికి తగిలింది. ఆ అలికిడి కామె వెనక్కు తిరిగింది. మన వాడిప్పుడామె ముఖం స్ఫుటంగా జూచి తెల్లబడి, పక్షవాతం వచ్చినవాడిలా కొయ్యబారి క్రింద బడిపోయేడు. ఇంతకీ ఆమె యెవరనుకున్నారో?" వాడిభార్య "ల...క్ష్మి..."

